ఆ ఎముకల్తోపాటు ఒక ఎండు రెమ్మ వుంది. అప్పు డను కున్నాను ఆ ముసిలివాని ఎముకలు ఆ మామిడి చెట్టుయొక్క కడాపటి ఎండుకొమ్మ. అవే అవి. ఎముకలు కావు అవీ పుల్లలే అంటారా ? అదీ నాకు సమ్మతమే ! కథలో ఏమంటే ఏమి కాదు ?

* * * * *

ఎన్నైనా కావచ్చుగాని తిరుగచూచిన ఆ లేలేత రసాలం మాత్రం నా చేతినుండి మాయమైన విత్తనమువల్ల మొలిచిం దనడానికి ఒప్పుకున్నాడు కాదు, మా నిజం తోటమాలి. అప్పు డన్నాను, "ప్రాజెట్టు విత్తనం వెళ్ళి స్వర్గంలో కల్పవృక్షమైం" దని. "హహహ !" అని నవ్వాడు వాడు నీళ్ళు మొక్కలకు దొడదొడా పోస్తూ. కాని కడాపటి ఎండుకొమ్మమాత్రం నవ్వలేక పోయింది. పువ్వు పూయలేకపోయింది. గూడు ఎప్పుడైతే చెడి పోయిందో అప్పుడే విడిపోయింది. అదాకా చెట్టునే వున్నానను కుంది పాపం !

.... .... .... .... ....

# కోడిపుంజు అమ్మన్న

"ఎగిరే కోడి ! - ఎగిసే పడవ !
చూసే పిల్ల ! - కాసే పందెం !

అదిగది గదిగో ! పడాలి మంచి ముక్కలు" అంటూ రివటయ్య తనకు పంచే పేకముక్కలు అందుకునేలో ఆ గుంపు మధ్యకు ఒక కోడిపుంజు ఎగిరి వాలింది. వెంటనే భోగన్న ఆ పుంజు

రెండుకాళ్ళూ తన ఎడం పిడికిట దొఱగ పుచ్చుకుని బయటికి గిరాటేస్తూ, కుడిచేత "బలే ముక్కలడ్డాయి" అంటూ తనకు పడ్డవాటిమీద చఱిచాడు.

ఈ పేకాట ఒకానొక గుడిసె ప్రక్క, చూరుకింద, దారి ప్రక్క, దడివోర—దండగొచ్చినా పండుగలాగే వుంది ఆవేళ రివటయ్యకు. అమ్మన్న అన్న బొమ్మకు నిలబడి చూస్తూ వుంది, రివటయ్య మీది కొరిగి ఆడికి పడ్డ పేకముక్కల్ని. "నీకేమైనా తెలిసేని అనే చూస్తున్నావా నా ముక్కల్ని?" అన్నాడు రివటయ్య, అలా ఆకాశంలోకి తలెత్తినట్టు తలెత్తి, తన ముఖంమీదకు సూటిగావున్న అమ్మన్న రెండుకళ్ళ చూపుల్ని తన రెండుకళ్ళ చూపుల్తో కలోసుకుంటూ! అమ్మన్న మరి వొంగలేదు. వొంగిందా ఆమె భారం అంతా వానిమీదనే పడి వుండేది!

అమ్మన్న "అంతా తెలిసే చూస్తారా? తెలీకుండాను చూస్తారు. ఆలా తెలియకుండా చూచేవాళ్ళల్లో దాన్ననుకో నన్ను!" అంది. భోగన్న "ఆట్టే మాట్టాడించకు అమ్మాయీ మమ్మల్ని. మాట్టాడించావా కోడిపుంజుని గిరాటేసినట్టు నిన్ను కూడా గిరాటేస్తాను. అది ఒడ్డున పడింది గాని నీవు గోదావరి లోనే పడ్డం!" అన్నాడు. "పడెయ్యి చూస్తాను! గిరాటెయ్యి చూస్తాను. ఏమట్టుకు గిరాటేస్తావో చూస్తాను?" అని పంవిటి సర్దుకు తంచన్‌గా నిలబడింది అమ్మన్న. భోగన్న నదురూ బెదురూ లేకుండా ఆమె చదునుగాని ఎదురొమ్మును చూస్తూ "కోడిపుంజుని ఏమట్టుకు గిరాటేశావు?" అని అడిగాడు. "దానికున్న కాళ్లు!" అంది అమ్మన్న. "నీకున్న—" అని

భోగన్న ఎదిరిమాట పూర్తిచేసేలో ప్రేక్షకజనం పకాల్మని నవ్వారు! దాంతో అమ్మన్నకు అక్కసు ఎక్కసమైంది కాని అణచుకు కిక్కురు మనకుండా పంతం కొద్దీ రివటయ్య మీదకు ఇంకా వొరిగిందై. "ఆ ముక్కేయ్యరా!" అంది. "నీకు తెల్దు వూరుకో! పిల్లా" అని వెనక్కు నెట్టాడు రివటయ్య.

ఆ నెట్టి బడ్డంలో అమ్మన్న నిటాగ్గా నిలుచుంది. తిరిగి ఎగిరి ఆటమీద వ్రాలబోయే వెనుకటి కోడిపుంజు కాళ్ళు ఈ పర్యాయం అమ్మన్న తల్లో చిక్కడి పోయినాయి. అమ్మన్న వొత్తు జుత్తులో గోళ్ళిరుక్కు గిలగిలమంటా ఆ కోడి ఆమె నెత్తిమీద కొట్టుకు పోసాగింది. చుట్టూ పదిమందీ కోడిపుంజు నట్టుకు అమ్మన్న జుత్తునుంచి విడమర్చి, కోడిపుంజునో ప్రక్కకు విసిరేస్తూ, అమ్మన్నను కసిరారు, "మొగాళ్ళాడే ఆట కాడికి ఆడాళ్ళ రావడం బాగోదు" అంటా. ఆడేవాళ్ల చెక్కు చెదరకుండా ముక్కమీద ముక్క, ముక్కప్రక్క ముక్క వేసేసుకుంటూ, మీసాలు దువ్వుకుంటూ, వేషాలు మార్చుకుంటూ రోషాలు పెంచుకుంటూ తన్మయత్వంలో మునిగి తేల్తూ వున్నారు.

అమ్మన్న "ఆడదాని గుడిసె పక్కన మగాళ్ళ పేకాడ వచ్చా? కోడిపుంజుని ఎగరెయ్యొచ్చా? నా ముఖం పుళ్ళ అయ్యేలా అక్కేసిందే ముండా పుంజు" అంటూ గీసుకు పోయిన నెత్తురు చారలు చీరను తుడుచుకుంటూ గుడిసె లోపలకు వెళ్ళి పోయింది.

రాత్రి తొమ్మిదింటికి రివటయ్య గుడిసెలో ప్రవేశిస్తూ "నీకు పేకముక్కలు తెలుసునే" అని అడిగాడు.

"తెలియకేం? ఆటకూడా తెలుసును. నేను మంచి వయస్సులో వున్నప్పుడు క్లబ్బుల్లో కళ్ళాపు సల్లేదాన్ని, పళ్ళాలు

కడిగేదాన్ని. చెయ్యి లోఁచేస్తే నన్ను కూకో బెట్టుకుని చాలా కాలం దమ్మీగా ఆడించి ఆడించి, తుదకు నన్ను పూరా ఆట కత్తెగా నేర్పేశారు ఆటంతా! ఆళ్ళు నేర్పేదేంటి? దానంతటదే వచ్చేసింది చూస్తూవుంటేని!"

"క్లబ్బుల్లో వోళ్ళు చదువుకున్న వోరుకాదే. ఆరు దబ్బేట్టి పేకాడుతారే?"

"పేకా ఆడతారు—"

"మఱి సొప్పక్కర్నేదు నీ శృంగారము!"

"అది కాదు రామాంవా! బుల్లియర్డ్సు! సరియైన ఉజ్జీగా దర్జామనిషి లేకపోతే ఆళ్లు మార్కరుతోఁటే ఆడేవాళ్లు ఆ ఆట."

"మార్కరంటే ఆడానుగా?"

"మార్కర్ అన్నవాడు మగాడే. మనజాతి వోడే, యింయీలు మనిషే! క్లబ్బుల్లో కులం పాటింపులూ లేవు, జలం పాటింపులూ లేవు, చదువుల పాటింపులూ లేవు, శాస్త్రాల పాటింపులూ లేవు, ఆటలో గోటు హంశలోనీటు వుంటేశాన!"

"మఱి బుల్లీ! నీవు బుల్లియర్డ్సు నేర్చుకోలే?"

"నేర్చుకోకేం! నడి యీధిలో గోళీల్లాంటి ఫక్కీదే అది. అసలు టెన్నిసును మిక్సెడ్‌చేసే జాతకం నాదిఅని అనే వారు ఆరందఱూను; వారిలో వారు అనుకొనేవారు నేను బలే టీన్నులో వున్నానంటూ! ఆ బానే నా కర్థం అయ్యేది కాదు నా రూపంవొంక యావన్మందీ చూచేదాకా!"

రివటయ్య "అమ్మన్నా! అవితే నీకింతకన్న మంచి వయసు వుండేదా ఏంటే మునుపు? ఇదే నీ మంచివయసు అనుకొంటూ వున్నాను!" అని అంటూ అమ్మన్న వొంటిమీద చెయ్యేశాడు ఆప్యాయంగా!

పండుకొన్న అమ్మన్న పైకిలేస్తూ "వొళ్లు జలదరించి పోయిందిరా ఈ పొద్దు ఎంచేతో నీవు చెయివేసే తలికి. ఇదివఱ కెప్పుడూ లేదు. రివలయ్యో ! సూడువొళ్ళు," అని పురమా యించింది.

రివటయ్య నిధానంతో చెయ్యేసి ఆమె వొంటిని తాకుతూ "అవునే–ఉడుకా ఉష్ణమా ?"

"దిక్కుమాలిన కోడిపుంజు అక్కినప్పటినుంచి ఈలాగే పక్కలు వెచ్చగా వున్నాయి."

"పక్క వెచ్చనేంటే ! పట్టుకుంటే తెగ్గాలి పోతూవుంటేనే నా వేళ్లు ?"

"ఆ పుంజెలావుందో పాపం !"

"పుంజెలా వుండడమేంటి ? పుంజు బాగానే వుండి వుంటుంది"

"ఎవరిదో ఆ పుంజు ?"

"ఆ భోగయ్య గాడిదే !"

"అన్నట్టు నేను నీ మీదకు వొరిగితే భోగయ్యగాడికి అంత పొయ్యేకాలం ఏమొచ్చె ! అడగలేవు నువ్వు ? నోరులేదు నీకు ?"

"గెలుపెప్పుడూ వాడిదే అదేంటో. అంచేత ఆడిముందు నా గొంతుక నెగ్గదు."

"పోనీ కోడి పుంజెవరిదో తెలుసుకున్నావు ?"

"అదీ ఆ భోగయ్యగాడిదే"

"ఆడట్టుకు పోయాడా ?"

"ఆఁ"

"అధవా ఆడి పుంజువన్నా నీవు తీసుకొస్తేనేగాని నాకీ రాత్రి నిదరపట్టదు. నిన్ను నిదరోనివ్వను"

"అధవా ఏమే! వీడు వెధవ అనుకున్నావా? భోగయ్య గాణ్నే జుత్తట్టుకు ఈడ్చుకొస్తాను చూడు నా తమాషా!" అన్నాడు రివటయ్య.

పై పరస్పర సంభాషణలో కడసారి ముక్కగా! ఎక్కడ లేని రౌద్రాకారం దాల్చినవాడై! చూచారా! రివటయ్య మనస్సు ఏలా మాఱిపోయిందో అంతలో! కనిపెట్టారా!

రివటయ్య ఒక్క క్షణికంలో భోగయ్య ఇంటి ముంగిట డేగ వాలినట్టు వాలాడు. భోగయ్య అతిజాలిగా తన పుంజు టెక్కల్లో కంటా చెయ్యెట్టి అప్పక్కిని దువ్వుతూ, రివటయ్య అడుగుల జాడకనిపెట్టి "రివటన్నా! పుంజుకు వెచ్చగావుంది. ఉష్ణంకాబోలు" అన్నాడు.

రివటయ్య తాను వచ్చిన రూం అంతా వెనక్కి నెట్టేసినట్టు మఱచిపోయి, తానున్నా పుంజొంక చూస్తూ "గుడిసెలో నా అమ్మన్నకున్ను ఉడుకు తగిలింది" అన్నాడు.

భోగన్న "ఎప్పట్నుంచి?"

రివటన్న "ఎప్పట్నుంచేంటిరా? పొద్దోయి మనం పేకాడుకొనేటప్పుడు నామీద వాలింది. సూసిన్నీ అడుగుతావు?"

"అంటే ఇది అక్కినప్పట్నుంచీనా?"

"ఏమీ తెలీనోడికి మల్లే మాటాడుతావు! నీవేగా అమ్మన్న మీదకు పుంజు విసిరింది?"

"విసిరానో అనుభవిస్తున్నాను. వరహాచేనే పుంజుకు వొళ్ళెల్లా వణుకు! సలిజొరం! సలసలానూ!"

దానిమీద రివటయ్య "నేను నా ఆడమనిషికి జ్వరం తగిలిందీ అంతే నీవు నీ కోడిపుంజును సాటవగా చెప్పడానికి జిమ్మెల్లా వచ్చిందిరా నీకు భోగయ్యా!" అంటూ అంతలో అగ్నిహోత్రుడి కళ్లెట్టుకు దగ్గరగా చూచేడు భోగయ్య విగ్రహాన్ని.

భోగయ్య కళ్ళంట నీళ్లు కారుతున్నాయి పుంజుమీద పడేలా. రివటన్న ఆ కన్నీళ్ళను ఇగిరించేస్తూ, తనకోపాగ్ని నిబ్బడి గావించాడా అన్నట్టు, "నేనడిగిన దానికి జవాబు పెగ ల్దేం నీ నోటంట?" అంటూ భోగయ్య జుట్టుపట్టుకున్నాడు. అదిరిపాటుగా పట్టుకున్నాడేమో, భోగన్న రివటయ్యకు చేజిక్కి నట్టయిపోయాడు. మఱి చేసేదిలేక చేతిలో పుంజు నెగరేశాడు. పుంజు రెండుకాళ్ళూ రివటన్న రెండు కళ్ళల్లోకి గుచ్చా పోయినాయి. దాంతో భోగన్న ముంగిట పెద్ద గలాటా జరుగ సాగింది. ఊరువాడా ఒక్కసారి మూగేసింది.

తాగుమోతుల గుద్దులాట కానోపునని మద్యపాన నిషే దాధికారులు భోగన్న గుడిసెను, రివటయ్య గుడిసెను చుట్టేసి సోదాచేశారుగాని ఘనరూపకంగాని, ద్రావక రూపకంగాగాని, పొగ రూపకంగాగాని, ఏవొక్క మత్తు పదార్థమున్నూ వారికి దొరకలేదు. కారణం తెలిసికోలేక జనం అంతా నేరం పుంజు మీదకు త్రోసివేయసాగారు. దాని కాళ్ళువచ్చి రివటయ్య కళ్ళల్లో గుచ్చుకు పోవడంవల్ల రివటయ్య కళ్ళు పోయినాయి గాని భోగయ్య నేరం గాదన్నారు. పుంజును నిత్యం కట్టేసి పడేసే ఏర్పాటు గావించారు. దాన్ని ఎక్కడకు చంకనెట్టుకు వెళ్ళరాదని భోగన్న కాంతికట్టారు.

ఆ కళ్లు పోవడం పోవడం మఱి రాలేదు రివటయ్యకు. రివటయ్యకు తొల్లిటి చూపొనడం సుతరాం మఱి జరగలేదు. ఎన్ని కట్లు కట్టించినా, ఎన్ని పసర్లుపోసినా, భోగయ్య పుంజు కూసినప్పుడు మాత్రం రివటయ్య కళ్లు విప్పారినట్టుండేవి, కాని నిజంగా కప్పడిపోయి వున్నాయి అనే అనుకోవాలి మనం. అదో భ్రాంతి కాబోసు భ్రాంతిఅనేకన్న కసి తీర్చుకోవాలిఅనే ధ్యాస అంటే ఎక్కువ సత్యమేమో !

ఇంత గొడవ జరిగినా పేకాట కేమీ మోసంరాలేదు. అని యధాప్రకారంగా అంతక్రితం గుడిసెపంచ, చదివోర ఏలా నిర్వహింపబడుతూ వచ్చేదో అంతకు రెండింతలుగా నెరవేర్ప బడేది, ఈ దరిమిలాను కూడా.

ఎటొచ్చీ, రివటయ్యకు ప్రత్యామ్నా రివటయ్యవాళ్లో కూర్చున్నట్టు అమ్మన్న కూర్చుని ముక్కలు తానే అందుకు తానేచూసుకు తానే ఆడుతూ వచ్చేది. భోగయ్యకు ఎక్కడలేని అక్కసుగానూ వుండేది. అమ్మన్న ఆడుతోందే అని ఒకవైపు ఇది, మఱోవైపు ఇది తన ఆట అమ్మన్న వచ్చినప్పట్నుంచీ పోతూవుండడమే పరిపాటి అవుతూ వుందే అని. అవుతూ వుందనేందుకే అవితే అంతవిచార ముండక పోయాదేమో, ప్రేక్షకజనం అంతా చెప్పుకోవడంవల్ల మఱీ కుదేల్లోకి వచ్చేసింది భోగయ్య బతుకు.

వెంటనే భోగయ్య ఒకరోజున ఏం చేశాడూ అంటే, పంచాయితీదార్ల తీర్పునకు వ్యతిరేకంగా తన పుంజును చంక నెట్టుకు ఆటకు చక్కావచ్చాడు. రావడంలో వుత్తపుంజును మాత్రమే చంక నెట్టుకు రాలేదు. పుంజుకాలికి కత్తికట్టి మఱీ

తీసుకొచ్చాడు,—ఒక్క ఎగురులో, అవసరం వెంబణ్ణి అమ్మన్న గొంతు కసుక్కున్న తెగిపోవాలనే కసి వాడిలోపల ప్రకోపించి వుండబోలు! ఎవరి కెఱుక ?

ఆట ప్రారంభించారు. అమ్మన్న అలా ముక్కేస్తూవుంది. భోగన్న ముక్కెయ్యడానికి ప్రత్యామ్నా తనవాళ్లో పెట్టు కూర్చున్న కోణ్ణి వదిలాడు. కోడి కాలినున్న కత్తి కోడి ఎగరడంలో ధగధగలాడి పోయిందంటే నమ్మండి ఆకాశ మార్గంగా! మరి అమ్మన్న కళ్ళు జిగేల్‌మన్నాయి. "నానూ పుంజునే! నానూ కోడిపుంజునే!" అంటూ అమ్మన్న ఒక కోణంగా తిరిగి, ఫెడీమని సూటిగా తన కాళ్ళ రెండు బొటన వేళ్ళూ, భోగన్న గొంతుక్కు క్రుచ్చేసింది. బొటనవ్రేళ్ళను చూశారుగందా పదిమందీ యీ తరువాతను! వాడైన రెండు కోడికత్తులున్నాయి.

"ఎక్కడివీ ?" అని అడిగితే "రోజూ కట్టుకు వస్తూ వున్నాను. రోజూ ఆటలో చీరకుచ్చెళ్ళు కప్పుకూర్చుంటూ వుండినాను. ఈ పొద్దు అవసరం వచ్చింది. ఉపయోగించాను" అంది అమ్మన్న.

ప్రజలందరూ "బలేపనిచేశావు" అని అమ్మన్నను మెచ్చుకున్నవాళ్ళే! "అమ్మన్న ఏం చేయగలదు పాపం! పుంజును తన్నాలనుకుంది. పుంజు తప్పించుకుపోంగా పుంజు యొక్క యజమానికి పొరబాటున తగిలి వుండవచ్చును" అని పంచాయితీదార్లు తీర్పుచెప్పారు.

అమ్మన్నను అప్పట్నుంచి "కోడిపుంజు అమ్మన్న" అని పిలవ మొదలెట్టారు. అసలు పుంజుగూర్చి ఎవరూ తల

పెట్టిందేలేదు నేటికీని. అది కత్తితో సహా గగన కుసుమం అయిపోయింది.

ఎవరన్నా గుడిసెకాడకొచ్చి లోపల "కోడిపుంజు అమ్మన్న వుందా?" అని ఆకాణ్ణుంచి అడిగితే, గుడ్డిరివటయ్య గుమ్మంలో కూకుడుండి గ్రుడ్లురుమడం తప్పిస్తే, మఱి ఆ ప్రాంతంలో కసి, అక్కసు మటుమాయమై పోయినాయి! పేకాటకూడా నాటితో అందఱూ విరమించేసు కున్నారు!

.... .... .... .... ....

## మానినీ చిత్తచోరుడు

ఈగాథ ద్వాపరయుగంనాటిది. శ్రీకృష్ణ భగవానుణ్ణి గుఱించి వ్రాసింది. ఇందులో కొంతమట్టుకు ప్రేమ ద్యోతకం అవుతూ వుంటుంది. కొంతమట్టుకు విరక్తి ద్యోతకం అవుతూవుంటుంది.

—ఋషులంతా స్త్రీలై భూలోకంలో సత్యభామాదుల క్రిందనూ, గోపికలక్రిందనూ జన్మించి, శ్రీకృష్ణభగవానుల వారితో అష్టైశ్వర్యాలూ, ఇష్టభోగాలూ అనుభవిస్తూ పిల్లాజెల్లాతో వ్రేపల్లెవాడలో వర్ధిల్లుతూవున్న సమయంలో శ్రీనారదమహర్షులు, వైకుంఠంలో వొంటిగా ఋషినామంతో వుండలేకపోతేనేం, శ్రీకృష్ణులవారి రసికత్వం గ్రహించాలనే కుతూహలంచేతనైతే నేం, తానూ వొకస్త్రీగా భూలోకంలో జన్మించి, సాక్షాన్నారాయణ మూర్తియైన యయ్యాదవకుంజరునితో సంసారం సాగించాలని గట్టి కోరిక తనలో వుదయింప జేసికొన్నాడు.

మహర్షులకు కోరికపుట్టిందీ అంటే తీరింది అన్నమాటే!